andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 17 సెప్టెంబరు 2025



కలెక్టరేట్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

ప్రజాపాలనకు.. పట్టాభిషేకం

- నేడు వేడుకలకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం కోసం ఏర్పాట్లు
- తెలంగాణ విమోచన దినోత్సవంగా చేపట్టనున్న బీజేపీ
- సాయుధ పోరాటంలో జిల్లా ప్రముఖులు
- నిజాంను ఎదిరించిన పోరాట యోధులు
- కామారెడ్డిలో ఫణిహారం రంగాచారి, కుప్రియాల్‌లో గోపాల్‌రెడ్డి, ఎర్రాపహాడ్‌లో బొక్క గుండారెడ్డి

కామారెడ్డి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ ఎస్ ప్రభుత్వం సెప్టెంబరు 17ను తెలంగాణ జాతీయ సమైక్య దినోత్సవంగా ప్రకటించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించింది. ఈ ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారిక కార్యక్రమాలను చేపడుతుంది. బుధవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ కార్పొరేషన్ ఎం.కోదండరెడ్డి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా చేపడుతుంటే బీజేపీ మాత్రం తెలంగాణ విమోచన దినోత్సవం అంటూ కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైంది. బీఆర్ఎస్ ఆయా పార్టీ కార్యాలయాల్లో సెప్టెంబరు 17ను పురస్కరించుకుని జాతీయ జెండాలు ఎగురవేయనున్నారు. బీజేపీ ఇప్పటికీ తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలంటూ పలు నిరసన కార్యక్రమాలు చేపడుతుంది. ఇక కమ్యూనిస్ట్ పార్టీలు విమోచన దినోత్సవంగా చేపడుతున్నాయని ఇలా సెప్టెంబర్ 17ను ఒక్కో రాజకీయ పార్టీ ఒక్కో విధంగా నిర్వహిస్తున్నాయి.



ఫణిహారం రంగాచారి



విఠల్‌రావుతో రంగాచారి

సాయుధ పోరాటంలో కామారెడ్డి వాసి ఫణిహారం రంగాచారి

నేడు తెలంగాణ విమోచన దినం

తెలంగాణ సాయుధ పోరాటంలో కామారెడ్డి జిల్లా చరిత్ర ఎంతో ఘనమైనది. ఎంతో మంది సాయుధ పోరాటయోధులు తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఫణిహారం రంగాచారి, రాజారెడ్డి, కుప్రియాల్ గోపాల్‌రెడ్డి, ఎర్రాపహాడ్‌కు చెందిన బొక్క గుండారెడ్డి వంటి ఎందరో ఉద్యమవీరులు పోరాట స్ఫూర్తిని నింపి జిల్లాకే గర్వకారణంగా మారారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ఫణిహారం రంగాచారి సాయుధ పోరాట యోధుల్లో ఒకరు. ఫణిహారం రంగాచారి మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి లక్ష్మణాచారి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని (మిగతా 8వ పేజీలో)

బాన్సువాడలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారకస్థూపం



బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద అప్పట్లో స్వాతంత్ర్య సమర యోధుల స్థూపాన్ని ఏర్పాటు చేసి ఉంచారు. బాన్సువాడ పంచాయతి సమితిగా ఉన్నప్పుడు ఉప్పల లక్ష్మయ్య, గంగా నాగయ్య, కుమ్మరి లక్ష్మారెడ్డి, నీలకంఠ్ నారాయణ్, లోక్ లక్ష్మయ్య, కొండా నారాయణ, క్రిష్ణారావు, కామినేని సుబ్బారావు పేర్లతో నేటికి ఈ స్మారక స్థూపం కనబడుతోంది.



కలెక్టరేట్‌లో వేదికను ఏర్పాటు చేసిన దృశ్యం

ఫణిహారం రంగాచారికి ఘన నివాళి



రంగాచారి విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఫణిహారం రంగాచారికి కామారెడ్డి జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ వార్షికోత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అన్నారు. సాయుధ పోరాటంలో 4 వేల మంది తమ ప్రాణాలను అర్పించారని తెలిపారు. ఈ పోరాటంలో లక్షలాది ఎకరాల భూమిని నిరుపేదలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. కౌలు రైతులు తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కుదారులుగా గుర్తించబడ్డారని తెలిపారు. కామారెడ్డి జిల్లా వాసి రంగాచారి లాంటి వారికి ఘన నివాళ్లు అర్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారోత్సవాలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, సహాయ కార్యదర్శి బాలరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజమణి, దేవయ్య, ఈశ్వర్, బాలరాజ్, సాయాగౌడ్, హనుమాండ్లు, సాయిలు, రాజిరెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ నెంబర్ ఐదులోని ఐదు గేట్లను ఎత్తివేసిన దృశ్యం

కొనసాగుతున్న నిజాంసాగర్ గేట్ల ఎత్తివేత

- నిజాంసాగర్‌లోని 56,992 క్యూసెక్కుల వరద

నిజాంసాగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు మంగళవారం నాటికి వచ్చి చేరుతుంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం వరకు ప్రాజెక్టు వీఆర్ నెంబర్ ఐదలోని ఐదు గేట్లను ఎత్తి వరద నీటిని మంజీరా నదిలోనికి వదిలేస్తున్న విషయం పాఠకులకు విదితమే. మంజీరా నది వెంట 56,992 క్యూసెక్కుల వరద నీరు వస్తూ ఉండటంతో తాజాగా 20 వరద గేట్లలోని నాలుగు గేట్లను ఎత్తి పది వేల క్యూసెక్కులు వరద నీటిని మంజీరా నది లోనికి వదిలి వేస్తున్నారు. ప్రాజెక్టు మొత్తం 9 గేట్ల ద్వారా 61,542 క్యూసెక్కుల నుంచి మంజీరా నదిలోనికి విడుదల చేస్తూ ఉండటంతో వరద నీరు ఉరకలు వేస్తుంది. ప్రధాన కాలువ వెంట వెయ్యి క్యూసెక్కుల వరద నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. 40 ఏళ్ల తరువాత ప్రాజెక్టు 20 గేట్లలోని గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. ఆగస్టు మూడో వారంలో 20 గేట్ల ద్వారా నీటిని వదలడంతో 22 ఎకరాలలో 90 మంది రైతుల పంట భూముల్లో ఇసుక మెట్ట వేయడంతో రైతులకు అధిక మేరకు పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం వివరాలను జిల్లా యంత్రాగానికి నివేదిక పంపినప్పటికీ రైతులకు పంట నష్టపరిహారం అందేకపోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి క్రమేపీ వరద నీరు వస్తుండటంతో 27 రోజులుగా ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి దిగువకు వదులుతూ ఉండటంతో నిజాసాంగర్ ప్రాజెక్టు నీటి నిలువలతో పాటు గేట్ల ద్వారా దిగువకు విడుదల అయ్యే నీటిని సందర్శకులు అస్వాదిస్తూ కేరింతలు వేస్తూ ఆనందంలో మునిగిపోతున్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరిలో తడి, పొడి విధానంపై అవగాహన

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం అడ్లూర్ గ్రామంలో మంగళవారం పద్మపాని సొసైటి, కేర్ కార్బన్ ఎక్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంయుక్తంగా రైతులకు వరిలో తడి పొడి విధానంపై అవాహన కల్పించడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి పొడి విధానం పాటించడం వల్ల వరిలో మీథైన్ అనే విష వాయువను తగ్గించడం జరుగుతుందన్నారు. దీని వల్ల పర్యావరణాన్ని కాపాడుదాము. అలాగే ఎరువుల వినియోగాన్ని సద్వినియోగం చేసుకుంటే భూమి కూడా సారవంతం పెరుగుతుందన్నారు. నీటి వినియోగం కూడా తగ్గడంతో దోమ పోటు రాకుండా కాపాడుతూ పిలకలు కూడా ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. అనంతరం తడి పొడి విధానం పాటించినందుకు రైతులకు ప్రోత్సాహకరంగా అడ్వాన్స్‌గా ఎకరానికి రూ.500ల చొప్పున రైతులకు పారితోషకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎక్స్ ప్రతినిధులు కార్తీక్‌రావు, నీలేష్, చందు, పండు, బిశ్రం, అలాగే పద్మపాణి డైరెక్టర్ సత్యనారాయణ, ఏఈవోలు దేవేంద్ర, మాజీ కౌన్సిలర్ గడ్డమీది రాణిమహేష్, జిల్లా కో-ఆర్డినేటర్ వినాయక్, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవునిపల్లిలో చెప్పులు, మద్యం సీసాలతో క్యూపెట్టిన రైతులు

యూరియా కోసం రైతుల నిరీక్షణ

- చెప్పులు, మద్యం సీసాలు, రాళ్లు, ఇటుకలతో క్యూ

భిక్కనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. యూరియా కొరత కారణంగా సొసైటీలకు యూరియా వస్తుందని సమాచారం వస్తే చాలు గంటల తరబడి సొసైటీలు, గోదాంల ముందు రైతులు పెద్దఎత్తున క్యూ కడుతున్న పరిస్థితి ఉంది. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి సొసైటీతో పాటుగా సొసైటీ పరిధిలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి యూరియా వచ్చిందన్న వార్త సోమవారం రాత్రి తెలియడంతో మంగళవారం ఉదయం 3 గంటలకే ఆయా గ్రామాల రైతులు గోదాంల ముందు పెద్దఎత్తున ఇటుకలు, బస్తాలు, చెప్పులు, ప్లాస్టిక్ బకెట్లు, మద్యం సీసాలతో క్యూ పెట్టారు. దీంతో అంతంపల్లి సొసైటీకి వచ్చిన 240 బస్తాల యూరియా, లక్ష్మీదేవునిపల్లి సొసైటీకి వచ్చిన 200ల బస్తాలను క్యూ ప్రకారం సిబ్బంది పంపిణీ చేసి క్యూలో ఉన్న మిగితా వారికి సొసైటీ సిబ్బంది టోకెన్లు ఇచ్చి ఇకముందు వచ్చే లోడ్‌లో ముందుగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే యూరియా కొరతను తీర్చాలని, యూరియా కొరతతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



చేప పిల్లల పంపిణీలో జిల్లాకు మొండి చేయి

- ప్రభుత్వం తీరుపై మత్స్యకారుల ఆగ్రహం
- జిల్లాను ఆన్‌లైన్ టెండర్లలో ఖరారు చేయని ప్రభుత్వం
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఇక లేనట్లేనా?

7

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



ఇందిరమ్మ ఇల్లును పరిశీలిస్తున్న దృశ్యం


భిక్కనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి బిల్లులను పొందాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం గాంధారి మండలంలోని వండ్రియాల్, గుర్జాల్ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. గుర్జాల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం వండ్రియాల్ గ్రామంలో ఆర్అండ్‌బీ కల్వర్ట్‌లను పరిశీలించి కల్వర్ట్‌ల పరిస్థితిని ఏఈలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. గాంధారి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన 65 మంది బాధితులకు రెడ్ క్రాస్ తరఫున దుప్పట్లు, సహాయ కిట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో మురళి, తహసీల్దార్ రేణుకా చౌహాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ, ఆర్ఐ ప్రదీప్, రెడ్‌క్రాస్ సిబ్బంది గంగయ్య, అన్నారెడ్డి, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

కామారెడ్డి టౌన్: పత్తి కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పత్తికొనుగోలు పై ఆయా శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు క్రాప్ బుకింగ్ త్వరగా చేయించాలని, కౌలు రైతులకు సంబంధించి ఏఈవోలతో ఆన్‌లైన్ ఎంట్రి చేయించాలని తెలిపారు. పత్తిని తరలించడానికి ఎలాంటి అంతరాయం లేకుండా రవాణ శాఖ చూడాలని అన్నారు. జిన్నింగ్ మిల్లులలో ఉన్న వేబ్రిడ్జిలు, తునికలు సరిగా ఉన్నాయా లేదా లిగల్ మెట్రాలజి శాఖ పరిశీలించాలని తెలిపారు. ఎలాంటి అవకతవకలు లేకుండా సీసీఐ చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

దోమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు సరిపడే యూరియాను తెప్పించాలని కోరుతూ మంగళవారం దోమకొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు యూరియాను సరఫరా చేయాలని కోరగా అందుకు షబ్బీర్‌అలీ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. అలాగే 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల్లో ఇసుక మేటలు వేసిన రైతులకు నష్టపరిహారం అందించే విషయమై చర్చించినట్లు తెలిపారు. దోమకొండ గుండ్ల చెరువుకు బుంగ పడిన విషయాన్ని షబ్బీర్‌అలీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల మరమ్మతులు సైతం చేపట్టాలని కోరినట్లు తెలుపగా అన్ని సమస్యల పట్ల ఆయన సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.



షబ్బీర్‌అలీకి వినతిపత్రం అందజేస్తున్న దోమకొండ నాయకులు

కంచె లేక.. ప్రమాదపు అంచుల్లో..

- రోడ్ల పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు
- కాలం చెల్లిన స్తంభాలు

8





హిందీ పండిత్‌లను సన్మానిస్తున్న డీఈవో రాజు

ప్రపంచవ్యాప్తంగా హిందీకి గొప్ప గుర్తింపు

- డీఈవో రాజు

సదాశివనగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాషకు గొప్ప గుర్తింపు ఉందని డీఈవో రాజు అన్నారు. మంగళవారం హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో ఘనంగా హిందీ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్మాజీవాడి ఉన్నత పాఠశాల విద్యార్థులు, సదాశివనగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్యాలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ హిందీ యొక్క గొప్పతనాన్ని ప్రశంసిస్తూ దాని గొప్పతనాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యోసఫ్, ప్రిన్సిపాల్ రాజారెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమౌళి, ఇంద్రశేఖర్, చింతల లింగం, సహేందర్, జ్ఞానేశ్వర్, రమేష్, మెహర్, ఉన్నీసా, కవిత, సుకుణ, కరుణ, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పోషణతో పాటు విద్యను అందించాలి

సదాశివనగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణతో పాటు విద్యనందించడం కూడా ఒక భాగం చేయాలని నూతన జాతీయ కమిషన్ 2020లో ప్రవేశపెట్టడం జరిగిందని దీనిని విజయవంతం చేయడానికి అంగన్‌వాడీ టీచర్లకు అడ్లూర్ ఎల్లారెడ్డి రైతు వేదికలో తాడ్వాయి, సదాశివనగర్ మండలాల అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు పద్మ, పద్మావతి, జ్యోతి, వనజ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0 నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు నవచేతన, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ఆదర్శ శీల పేర్లతో ప్రత్యేక కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారులకు బాల్య సంరక్షణతో పాటుగా విద్యను పోత్సహించడంతో భాగంగా అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంపై దృష్టి సారించే విధంగా చిన్నారులకు విద్యను బోధిస్తున్నామన్నారు. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు కూడా మినీ పాఠశాలలుగా ఏర్పడబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమాన్ని అంగన్‌వాడీలు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బైక్ చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితులతో డిచ్‌పల్లి సీఐ వినోద్‌కుమార్, ఎస్సై

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): బైక్‌కు చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డిచ్‌పల్లి సీఐ వినోద్ కుమార్, స్థానిక ఎస్సై ఎండీ మాలిక్ రహ్మాన్ తెలిపారు. మంగళవారం డిచ్‌పల్లి సీఐ వినోద్ కుమార్, స్థానిక ఎస్సై ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జక్రాన్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో గత నెల 18న జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎం. కార్తీక్ బైక్‌ను అక్కడ ఉంచి పనుల నిమిత్తం వెళ్లారు. దీన్ని గమనించిన ఇద్దరు నిందితులు బైక్ ను చోరి చేసుకుని తీసుకెళ్లారని తెలిపారు. మంగళవారం గాంధీ నగర్ వద్ద పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమాన స్పదంగా కనిపించడంతో వారిని పట్టుకుని వారివద్ద ఉన్న బైక్‌ను చూడగా గత నెల 18న ఈ బైక్‌ను దొంగతనం చేసుకుని పారిపోయామని నిందితులు తెలిపారని వారు తెలిపారు. బైక్ చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి వాసి మృతి


పురుషోత్తం (ఫైల్)

మోర్తాడ్,సెప్టెంబరు,16(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని తాటికొండ పురుషోత్తం (59) అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్సై రాము తెలిపారు. మెట్‌పల్లికి చెందిన పురుషోత్తం సోమవారం నిర్మల్ నుంచి షిఫ్ట్ కారులో మెట్‌పల్లికి వెళ్తుండగా మోర్తాడ్‌లో డివైడర్‌ను ఢీకొనడంతో పురుషోత్తం అక్కడిక్కడే మృతి చెందాడని, డ్రైవర్ శేఖర్ కారును అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని ఎస్సై తెలిపారు. డ్రైవర్ శేఖర్‌కు గాయాలయ్యాయని ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. పురుషోత్తం భార్య తాటికొండ కళ్యాణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాము తెలిపారు

మోర్తాడ్‌లో మహిళ అదృశ్యం

మోర్తాడ్ , సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్‌కు చెందిన కామని పద్మావతి అనే మహిళ కనిపించడం లేదని ఎస్సై రాము తెలిపారు. పద్మావతి గత కొద్ది కాలంగా మానసిక పరిస్థితి సరిగా లేక బాధపడుతున్నారని మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త పురుషోత్తం ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బోధన్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల కారణంగా పాత బోధన్‌లోని బీటీ నగర్, జలాల్ బుకారి ఏరియాల్లో ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. కావున పట్టణ ప్రజలు సహకరించాలన్నారు.

మంజీరాలో యువకుడు గల్లంతు


చాకలి ప్రవీణ్ (ఫైల్)

నిజాంసాగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువ మంజీరా (నాగమడుగు)లో 30 సంవత్సరాల యువకుడు మంగళవారం నీటిలో గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్ 35 సంవత్సరాలు మంగళవారం ఉదయం అత్తగారిల్లుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు నాగమడుగు వద్దకు వచ్చి ఈత కొడుతూ అవతలిగడ్డకు చేరుకుంటానని గుడ్డలిప్పి నీటిలో వెళుతుండగా ప్రమాదవస్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ప్రవీణ్ మృతదేహం వెలికి తీసేందుకు రిస్క్ టీం బోటు ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం వరకు మృత దేహం లభించలేదు. మృతుడికి భార్య సునీత, పది సంవత్సరాల కుమార్తె, ఆరు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. ప్రవీణ్ తండ్రి ఫిర్యాదు మేరకు నిజాంసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపు ఉన్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఆల్ఫాజోలం పట్టివేత

మోపాల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆల్ఫాజోలం అమ్ముతున్న ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. మంగళవారం గుండారం గ్రామంలో ఆల్ఫోజోలం ఉందన్న పక్క సమాచారంతో అశోక్, రమేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 600 గ్రాముల ఆల్ఫాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఉదయం 8గంటల ప్రాంతంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 ద్వారా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. వెంటనే పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని వయస్సు సుమారు 50-55 సంవత్సరాలు ఉండవచ్చని తెలిపారు. అతని ఒంటిపై బూడిద రంగు చొక్కా, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. జేబులో ఎటువంటి ఆధారాలు తొరకలేదని ఎవరైనా తెలిసిన వారు ఉన్నటయితే 8712659714 నెంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రైతులు సోలార్ పవర్ పై దృష్టి సారించాలి

ఆర్మూర్ , సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో విద్యుత్ ఉత్పత్తికి వనరులు తగ్గిపోతున్న సమయంలో సమస్య పరిష్కారానికి సూర్యశక్తి సోలార్ పవర్ పై రైతులు దృష్టి సారించాని ట్రాన్స్‌కో ఏఈ మనీషా అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం సోలార్ పవర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ మట్లాడుతూ.. సోలార్ పవర్ ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, కాలుష్యం లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని ఒక్కసారి పెట్టుబడి పెడితే 25 ఏళ్ల పాటు విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతాయన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌నాయక్, విడిసి అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, గురడి రెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు కల్లెం నర్సారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పెర్కిట్ గంగారెడ్డి, ఆలూర్ నారాయణ రెడ్డి, రుక్మారెడ్డి, దినేష్, ప్రతాప్‌గౌడ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పాఠశాల క్రీడోత్సవాలు

ఆర్మూర్, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల 69వ ఎస్‌జీఎఫ్ అంతర్ పాఠశాలల క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో జడ్పీహెచ్ఎస్ ఆలూర్ ప్రథమ, జడ్పీహెచ్ఎస్ కల్లెడి ద్వితీయ, జడ్పీహెచ్ఎస్ మిర్ధాపల్లి పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో గంగాధర్, ఆర్మూర్ ఎస్సై రాము, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడుమోహన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాడిచెరువుకు హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల నీటి విడుదల



బషీరాబాద్ కాడిచెరువుకు డీసీ ద్వారా కొనసాగుతున్న చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలనీరు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 16: (ఆంధ్రజ్యోతి) మండలంలోని బషీరాబాద్ కాడి చెరువుకు ఎట్టకేలకు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల నీటి విడుదల మంగళవారం నుంచి ప్రారంభమయ్యింది. 'కార్తెలు దాటిన కనికరించని భారీ వర్షాలకు నిండని చెరువులు' అన్న కథనానికి స్పందించిన అధికారులు మండలంలోనే అతిపెద్ద చెరువు బషీరాబాద్ కాడి చెరువుకు చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేశారు. వీడీసీ సభ్యులు డీసీ వద్ద పూజలు చేశారు. భారీ వర్షాలు లేక మండ లంలోనే అతిపెద్ద చెరువుగా పేరొందిన కాడిచెరువు నిండక పోగా ఆయకట్టు వ్యసాయభూములు సాగుకు నోచుకోలేదు. కనీసం ఎత్తిపోతల నీటితోనైన తమ గ్రామ కాడిచెరువునిండేలా చూడాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివానంద్ ఆధ్వర్యం లో పాలకవర్గ సభ్యుడు బాల్కొండ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌ను గత రెండు రోజుల క్రితం కలిసి మొరబెట్టుకున్నారు. దీనికి తోడు 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన సునీల్‌కుమార్ సంబంధిత అధికారులతో మాట్లాడి మోర్తాడ్ ముసలమ్మ చెరువు నుంచి ఎత్తిపోతల నీటిని విడుదల చేయించారు. వానలు లేక కాడిచెరువు వెలవెల బో తున్నదని తమగోడు వినిపించిన 'ఆంధ్రజ్యోతి'కి స్పందించి నీటివిడుదల చేయించిన సునీల్ కుమార్, సంబంధిత అధికారులకు వీడీసీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కనీసం నిరంతరాయంగా నీటిసరఫరా జరిగితే కాడిచెరువు నిండి అలుగు పారుతుందని కనీసం 15 రోజులపాటు నీరు వచ్చేలా చూడాలని వీడీసీ సభ్యులు కోరారు.

గౌడ కులస్థుల రాస్తారోకో

ఆర్మూర్,సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో మంగళవారం జిల్లా గౌడ్ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్థులు రాస్తారోకో నిర్వహించారు. తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్థులపై విడిసి ముసుగులో జరిగిన దాడిని ఖండిస్తూ రోడ్డుపై బైఠాయించారు. గౌడ కులస్థులను వేదిస్తున్న విడిసి సభ్యులపై చర్యలు తీసుకోవాలని వారు నినాదాలు చేశారు. వివిధ గ్రామాల నుంచి గౌడ కులస్థులు ఆర్మూర్‌కు తరలివచ్చిన గౌడ కులసులు మార్కెట్ కమిటి కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహిం చారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ తాళ్ళరాం పూర్‌లో పది నెలల క్రితం ఇదే విధంగా గౌడ కులస్థులను వేధించి జీవనోపాధిని దెబ్బ తీశారని ఆ సమయంలో విడిసిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి తిరిగి యధా విధిగా ఇటీ వల గౌడ కులస్థులపై దాడికి పాల్పడి వేదించడం అన్యాయమన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గౌడ కులస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్థులు పాల్గొన్నారు.

ఘనంగా టీచర్స్ డే

ఆర్మూర్ టౌన్ , సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో మంగళవారం టీచర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లను పట్టుశాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆకుల రాజు, ప్రోగ్రా చైర్మన్ ప్రకాష్, శ్రీనివాస్, గోపి కృష్ణ, డీకే రాజేష్, చేపూర్ గణేష్, పోల్కం వేణు, రామకృష్ణ, బాలాజీరావు, పాల్గొన్నారు.

ఘనంగా కోతి దేవుని ఆలయ వార్షికోత్సవాలు

నవీపేట,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(ఏ)లో మంగళవారం కోతి దేవుని 49వ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16న కోతి దేవుని ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీగా వస్తుంది. ఈ ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలపై స్పందించిన అధికారులు

- అధికారుల నిర్లక్ష్యంపై డీపీవో ఆగ్రహం
- పలువురికి మెమోలు జారీ



రాణాకలాన్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ

ఎడపల్లి,సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని పారిశుధ్య సమస్యలపై జిల్లా పంచాయతీ అధికారి స్పందించి పారిశుధ్య సమస్యలపై చర్యలు చే పట్టారు.'ఆంధ్ర జ్యోతి'దిన పత్రికలో సోమవారం ఎటుచూసినా చెత్తకుప్పలే అనే శీర్షికతో వచ్చిన కథనానికి డీపీవో స్పందించారు. పారిశుధ్య సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందికి మెమోలు జారీ చేశారు. ఎడపల్లి ఎంపీఓ మన్మోహన్ శాస్త్రికి మెమో జారీ చేయడంతోపాటు పంచాయతీ కార్యదర్శులను మందలించారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, లేనిపక్షంలో తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పలు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించి తమకు సమా చారం అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. దీంతో మంగళ వారం పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో పలు గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలకు పరిష్కారం లభించింది. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఛలో ఎస్‌పీడీ కార్యాలయం విజయవంతం చేయాలి

నవీపేట,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు వేతనాలను పెంచాలని కోరుతూ ఈ నెల 22న చేపట్టిన ఛలో ఎస్‌పీడీ ఆఫీస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. మంగళవారం మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో సంబంధిత కార్యక్రమానికి చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కేజీబీవీలలో నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు కావడం లేదని అన్నారు. నాన్ టీచింగ్ వర్కర్లకు నెలకు రూ.26వేల వేతనం చెల్లించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, నైట్ డ్యూటీలను రద్దు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫీస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రోజా, త్రివేణి, అన్నపూర్ణ, ఉమా, పద్మ, అనిత, లక్ష్మి, సునీత, గౌతమి, సునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

మెండోర, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని నిజామాబాద్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ వేదిక ద్వారా వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో విద్యుత్ సమస్యలపై వినియోగదారులు పోస్టు ద్వారా, వాట్సాప్ ద్వారా ఫోరామ్ కు ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. వినియోగదారులకు ఎలాం టి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులు సూచించారు. ప్రజ ల నుంచి వచ్చిన ఫిర్యదుల ఆధారంగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని అన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రాజీపడేది లేదన్నారు. విద్యుత్ సరఫరాలో అంత రాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్ ఆగిపోవడం, కాలిపోవడం, బిల్లులు సమస్యలు కొత్త సర్వీసులు, అదనపు లోడు ఇవ్వడంలో నిర్లక్ష్యం, ట్రాన్స్ ఫార్మర్ సమస్యలు, ఓవర్ లోడు, కాలిపోవడం, తరలించడం పేజ్ మార్చడం తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విద్యుత్ వినియోగదా రులు సీజీఆర్ఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. టెక్నికల్ మెంబర్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ కిషన్, సీజీఆర్ఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన

కోటగిరి,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని, వివిధ స్థాయిలను బట్టి బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని సుద్దులం, సుద్దులం తండా, ఎక్లాస్‌పూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఆయా గ్రామాలలో పలు ఇళ్లకు మార్క్ అవుట్ ఇచ్చారు. అనంతరం ఎత్తొండ, యాద్గార్‌పూర్, వల్లభాపూర్ గ్రామాలలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో క్యాకప్ప, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

రుద్రూరు,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీ డబుల్ బెడ్ రూమ్ దగ్గర కోటగిరి లింగవ్వ గత నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి తన ఇల్లు మొత్తం వర్షపు నీరు కురుస్తు ఇబ్బంది పడుతుందని స్థానిక బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ వెంటనే స్పందించి మంగళవారం బాధిత కుటుంబానికి చేయూతనందించారు. ఇంటిపైన కప్పుకోవడానికి తాడిపత్రి, నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు పార్వతి మురళి, రుద్రూర్ మండల అధ్యక్షులు అలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు కృష్ణం రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లే స్కూల్ తాతయ్య, నానమ్మల సమావేశం

వేల్పూర్, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన జంగం అర్జ హైదరాబాద్ గచ్చిబౌలిలో చదువుతున్న క్లే పాఠశాల తాతయ్య, నానమ్మల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి జంగం అశోక్ మాట్లాడుతూ పిల్లల చదువు, క్రమశిక్షణ తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాతృమూర్తులు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తువులు అందజేత

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్రాన్‌పల్లి, అర్గుల్‌లో మంగళవారం దాతలు విద్యార్థులకు క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 85 మంది విద్యార్థులకు నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, మాజీ సర్పంచ్‌లు కాటిపల్లి నర్సారెడ్డి, బాలకిషన్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు చిట్ల శ్యాంసుందర్, ఉపాధ్యాయుడు మాడవేరి రఘు విద్యార్థులకు క్రీడా దుస్తువులను అందజేశారు. అర్గుల్‌లో వీడీసీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో విద్యార్థులకు దాత డాక్టర్ ఏనుగు రవీందర్‌రెడ్డి క్రీడా దుస్తువుల కోసం సుమారు రూ. 30వేలు విరాళంగా నగదును అందజేశారు. అర్గుల్ వీడీసీ చైర్మన్ రాజేశ్వర్, కోశాధికారి రవీందర్, ప్రధానోపాధ్యాయులు లింగన్న, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు బాక్స్ మైక్‌సెట్ వితరణ

వేల్పూర్, సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రం బీసీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల కు స్థానిక ఫ్రెండ్స్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాక్స్ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు జాతీయ గీతంను సౌండ్ సిస్టం ద్వారా పాడడానికి సౌకర్యంగా ఉండేందుకు, పిల్లలు వివిధ పాటలపై నృత్యాలు చేయడానికి అవకాశం కల్పించేందుకు తాము విద్యార్థుల కోరిక మేరకు బాక్స్‌మైక్ సెట్ సిస్టంను అందజేయడం జరిగిందని యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మీ, ఉపాధ్యాయులు చంద్రకాంత్, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మొండి అశోక్, నవీన్, మగ్గిడి అశోక్, శేఖర్‌గౌడ్, దినేష్, హరీష్, సతీష్, తేజ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి టీచర్లకు మూడు రోజుల శిక్షణ

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 16: (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతువేదికలో పోషన్ బి పడాయి బి అనే అంశంపై మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని స్థానిక తహసీల్దార్ జి.ప్రసాద్ సీడీపీవో స్వర్ణలత మంగళవారం ప్రారంభంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 16 నుండి 18వ తేదీ వరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ శిక్షణ వల్ల సెంటర్లకు వచ్చే 0 నుండి6 సంవత్సరాల వయస్సుగల పిల్లల మానసికశక్తి, శారీకశక్తి, మేధోశక్తి పెరుగుతుంద మూడు రోజుల శిక్షణలో ఈవిసయమై ఆవగాహన పెంచుకుని పిల్లలకు బోధించాలని అన్నారు. శిక్షణ శిబిరంలో ఏసిడిపివో జ్ఞానేశ్వరి, ఏపిఎం గోపు కిరణ్ కు మార్ కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల సూపర్‌వైజర్‌లు గంగహంస, మంజూల, సరస్వతి శిక్షణనివ్వగా ఆయా మండలాల ఆంగన్‌వాడి టీచర్ల సంఘం అధ్యక్షురాల్లు దేవగంగు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అలుగు అందాలు అదరహో

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 16: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనసమందర్ చెరువు సోమవారం అర్ధరాత్రి నుంచి అలుగు పారుతుంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు సమీపంలోని గుట్టలపై నుండి జారిన వర్షపునీరు గ్రామ చెరువుకు చేరడంతో అలుగు పారుతుందని గ్రామస్తులు తెలిపారు. భారీ వర్షాలు లేక చెరువులో నీరు చేరకపోవడంతో ఆందోలనకు గురైన ఆ గ్రామ రైతులు సోమవారం తెల్లవారుజాము నుండి అలుగు పారుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగానైనా అలుగుపారిందని ఇక పంటలకు డోకాలేదని రైతులు అంటున్నారు. ఇదిలా ఉండగా కోనసముందర్ చెరువు అలుగు పారుతండడంతో బషీరాబాద్ కాడిచెరువుకు ఒక వైపునుండి చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతలపథకం నీరు వస్తుండగా మరోవైపునుండి కోనసముందర్ అలుగుపారి కాడిచెరువుకు చేరుతుండడంతో బషీరాబాద్ గ్రామరైతులు ఆనందపడిపోతున్నారు.


అలుగు పారుతున్న కోనసముందర్ చెరువు

యూరియా కోసం ఎగబడ్డ రైతులు


సొసైటీ ముందు గుమిగూడిన అన్నదాతలు

భీమ్‌గల్,సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు మంగళవారం సొసైటీకి యూరియా వచ్చిందని తెలుసుకున్న మండలంలోని అన్ని గ్రామాల రైతులు యూరియా కోసం వ్యవసాయ శాఖ కార్యాలయం తరలివచ్చి టోకెన్లు, యూరియా కోసం సొసైటీ గోదాం వద్ద ఎగబడ్డారు. ఈసందర్భంగా పోలీసులు బందోబస్తు మధ్య యూరియాను రైతులకు అందజేశారు. మండలంలో ఈ సీజన్‌లో 32580 ఎకరాల్లో పంట సాగుచేయగా ఇందుకు 4500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. ఇప్పటి వరకు 4310 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే వచ్చింది. మరో 190 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది.మంగళవారం భీమ్‌గల్ మండలానికి 900 యూరియా బస్తాలు వచ్చాయని ప్రతీ రైతుకు యూరియా అందజేయబడుతుందని రైతులు ఆందోళన చెందవద్దని ఏవో లావణ్య తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

వేల్పూర్,సెప్టెంబరు,16(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామ ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు స్థానిక వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చ్‌ఫాస్ట్ దుస్తువులను మంగళవారం అందజేశారు. ఈ 17, 18, 19న జరుగనున్న మండల స్థాయి క్రీడా పోటీలలో మార్చ్‌ఫాస్ట్ చేసేందుకు గాను రూ. 20వేలు గల దస్తువులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ మారుతి, గంగారెడ్డి, సతీష్, గడ్డం లింబారెడ్డి, బ్యాంక్ సాయిలు, అంక్సాపూర్ మల్లేష్, విఠల్ బాల్‌రెడ్డి, చేపూర్ సంతోష్, ముత్యం, గుడాల అరు ణ్, మాజీ ఎంపీటీసీ రవి, ఫోటో స్టూడియో బాబు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నుల అందజేత

నవీపేట,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జన వికాస్ సేవ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులతో పాటు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. పాఠశాలలో చదివే 35మంది విద్యార్థులకు సంబంధిత వస్తువులను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, సూరిబాబు, గంధం రాజేష్, లోకం నర్సయ్య, సాయి కుమార్ గౌడ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు భూమయ్య, ప్రధాన కార్యదర్శి శివకుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు సంతోష్, గ్రంథపాలకుడు సందీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పర్హత్ తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రేమికుల ఫిర్యాదు మేరకు విచారణ

బోధన్,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో కుక్కలను చంపి వేశారని ఫిర్యాదు అందిందన్నారు. జంతు ప్రేమికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఆయన తెలిపారు. కుక్కలను చంపడం నేరమని విచారణ అనంతరం వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కబ్జా భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

రుద్రూరు,సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామ శివారులో సర్వే నెంబర్ 202/6లో 1-12 గుంటల భూమి మా గ్రామ చెరువు కట్టకు సంబంధించిందని, ఈ ప్రభుత్వ భూమిని అక్బర్‌నగర్ గ్రామానికి చెందిన చిలపల్లి అనుంబాయి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ మంగళవారం చిక్కడ్‌పల్లి గ్రామ వీడీసీ సభ్యులు రుద్రూర్ తహసీల్దార్ తారాబాయికి వినతిపత్రం అందజేశారు. సర్వే చేసి విచారణ చేపట్టాలని కోరారు.

యూరియా అందుబాటులో ఉంచాలని ధర్నా

ఎడపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరుతూ మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ రైతులు వరినాట్లు వేసిన వరిపంట పొట్టదశలో ఉందని వరిపంటకు యూరియా అవసరం ఇపుడు ఉక్కువగా ఉంటుందని రైతులకు యూరియాను అందుబాటులో ఉంచి యూరియా కొరతను నివారించాలని, వర్షాలకు పంటలు దెబ్బతిన్న ఏరియాలో సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందించాలని, కొత్తవారికి పెన్షన్‌లు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ దత్తాత్రికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

ట్రస్మా ఆర్మూర్ డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్ , సెప్టెంబరు, 16(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాలలో మంగళవారం ట్రస్మ ఆర్మూర్ డివిజన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ట్రస్మ నిజామాబాద్ జిల్లా కన్వీనర్ రాజు గుజరాతి అధ్యక్షతన ఆర్మూర్ డివిజన్ ట్రస్మ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ ట్రస్మ అధ్యక్షుడిగా బొద్దుల చక్రపాణి(జక్రాన్‌పల్లి సర్వతి స్కూల్ కరస్పాం డెంట్), ప్రధాన కార్యదర్శిగా మంద ప్రభాకర్(పడిగెల్ భానుస్కూల్), కోశాధికారిగా పీరీ గంగాధర్(భీమ్‌గల్‌లో శారద ఆశ్రమం)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ తమ ప్రైవేట్ పాఠశాలలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చుల రమేష్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

యాజమాన్య ఉపాధ్యాయులకు శిక్షణ

ముప్కాల్, సెప్టెంబరు, 16 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని యాజమాన్య ప్రధానోపాధ్యాయులకు దివ్యాంగులైన విద్యార్థులను గుర్తించి ప్రశస్థ యాప్‌లో నమోదు చేయడం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రశస్థ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థుల సమాచారం పొందుపర్చాలని ఈ శిక్షణలో తెలిపారు. 21 రకాల అంగవైకల్యాలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారాలను చూపేందుకు ఈ ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుడు ప్రసాద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు 16: (ఆంధ్రజ్యోతి)మండలంలోని కోనసమందర్ గ్రామానికి చెందిన గోపు వెంకటేశ్వర్ రావు (స్వామి) ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అందజేయగా మంగళవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బట్టు సతీష్, గట్టు హన్మాండ్లు, చెంగల్ల నర్సయ్య, పోతుగంటి తిరుపతి, నజీమ్ తదితరులు పాల్గొన్నారు.


నీలకంఠేశ్వర ఆలయంలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఆలయాల్లో హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమానికి సహాయ కమిషనర్ విజయరామారావు హాజరయ్యారు. హుండీలో రూ.3,35,909 ఆదాయం చేకూరింది. ఆదాయంలో రూ.2,93,120 నగదు రూపంలో రాగా, రూ.42,789 నాణెల రూపంలో వచ్చింది. దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాంరవీందర్ గుప్త, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిగిర తిరుపతి, కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులున్నారు.

మాధవనగర్ సాయిబాబా హుండీ లెక్కింపు..

మాధవనగర్ సాయిబాబా దేవాలయ హుండీని దేవాదాయ శాఖ అధికారులు ఆలయ సిబ్బంది లెక్కించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షకురాలు కమల పర్యవేక్షణలో లెక్కించిన హుండీ లెక్కింపులో 2లక్షల 96వేల 649 రూపాయలు ఆదాయం సమకూరింది. ఆలయ కార్యనిర్వాహణ అధికారి రవీందర్, అర్చకులు హరికృష్ణశర్మ, రామకృష్ణ శర్మ, సిబ్బంది లలిత, సంతోష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మీసాల శ్రీనివాస్‌రావు, రాంచందర్‌లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. 4-18 సంవత్సరాలు, ఆపైబడిన క్రీడాకారుల కోసం ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలో సుమారు 200లకు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభకనబర్చిన 30మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పవన్ కుమార్, రాజేందర్, స్కేటింగ్‌కోచ్‌లు గణేష్, సాయికుమార్, శంకర్, జయరాం, వంశీ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్

స్వచ్ఛతా హీ సేవా పోస్టర్లను ఆవిష్కరించిన మునిసిపల్ కమిషనర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): పట్టణప్రాంతాల్లో పరిశుభ్రత పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించిందని నగర కమిషనర్ దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఇంటిస్థాయిలో, సమాజస్థాయిలో మొక్కలు నాటడం చేపట్టాలని అన్నారు. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ రవీంద్రసాగర్, డిప్యూటీ కమీషనర్ రవిబాబు, సానిటరి ఇన్స్‌పెక్టర్లు మహిపాల్, ప్రశాంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్ల గడువు పెంపు

సుభాష్‌నగర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్ల గడువు సెప్టెంబరు 30 వరకు పొడగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని ప్రైమరీ హైస్కూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క ప్రాజెక్టులను తప్పనిసరిగా సెప్టెంబరు 30లోపు నామినేషన్లు నమోదు చేయాల్సిందిగా ఆయన సూచించారు. సెప్టెంబరు 21 నుంచి సెలవులు ఉన్నందున 20న ఎట్టి పరిస్థితుల్లో నామినేషన్లు పూర్తిచేయాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తక్కువగా ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లు నమోదు చేయడం జరిగిందని పొడగింపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్క పాఠశాల నామినేషన్లను పూర్తి చేయాలని కోరారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్‌ను సంప్రదించాలని కోరారు.

'విద్యార్థుల తల్లిద్రండులను మోసం చేసిన స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి'

సుభాష్‌నగర్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులను మోసంచేస్తున్న కారుణ్యహైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కారుణ్య హైస్కూల్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేసి విలేకరుల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ ఇంపల్స్ కార్పొరేట్ స్కూల్ పేరుతో కారుణ్య హైస్కూల్‌లో కొందరు అధికార పార్టీ వ్యక్తుల అండతో విచ్చలవిడిగా అడ్మిషన్లు చేపట్టారని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కార్పొరేట్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు చేసి ఫీజుల దోపిడీకి పాల్పడ్డారని అన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా పాఠశాల నడుపుతున్నారని అన్నారు. విద్యాశాఖలోని కొందరు అధికారులు పాఠశాల యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే పాఠశాల యాజమాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నిఖిల్, సాయికిరణ్, ప్రసాద్, వంశీ, రాజు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చేపపిల్లల పంపిణీలో

జిల్లాకు మొండిచేయి

- ప్రభుత్వం తీరుపై మత్స్యకారుల ఆగ్రహం
- జిల్లాను ఆన్‌లైన్ టెండర్లలో ఖరారు చేయని ప్రభుత్వం
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఇక లేనట్లేనా?
- తొమ్మిదేళ్లుగా కొనసాగిన ఉచిత చేపపిల్లల పంపణీ పథకం
- చేపపిల్లల పంపిణీ లేక నిరాశ చెందుతున్న మత్స్య కార్మికులు

నిజాంసాగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడాది జిల్లాలోని నీటి వనరులతో పాటు నిజాంసాగర్ కౌలాస్ సంగీతం రిజర్వాయర్‌లలో చేప పిల్లల పంపిణీ పథకం అమలు లేనట్లేనని మత్స్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. 2025-202 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 778 చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ ఏడాది టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాల్సిన ప్రభుత్వం యంత్రాంగం నేరుగా కామారెడ్డి జిల్లాకు మొండి చేయి చూపారు. రాష్ట్రంలో 28 జిల్లాలకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 13వ తేది నుంచి టెండర్ల ప్రక్రియకు ఖరారు చేసింది. కాని కామారెడ్డి జిల్లా పుట్టిన రోజు ప్రక్రియ ఖరారు చేయకపోవడంతో జిల్లా మత్స్య కారులు నిరాశకు గురయ్యారు. గత ఏడాది జిల్లాలో కోటి 38 లక్షల చేప పిల్లను నీటి వనరుల్లో విడుదల చేసింది. కోటి 38 లక్షల చేప పిల్లలకు గాను కోటి 13లక్షల రూపాయల నిధులను మంజూరు చేసింది. చేప పిల్లల పంపిణీ చేసే కాంట్రాక్టర్ టెండర్ దాఖలు చేసి చేజిక్కించుకున్నారు. 2022-2023 సంవత్సరం నుంచి 2024-25 జిల్లాలో చేప పిల్లలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ జిల్లా పేరిట టెండర్లను దాఖలు చేసేందుకు ముందుకు రాకపోయారు. జిల్లాలో గత ఏడాది కోటి 38 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయడంతో జల వనరుల్లో 3630 మెట్రిక్ టన్నులు చేపలు ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. మత్స్యకారుల ఉద్ధరణ కోసం ప్రభుత్వాలు ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని తొమ్మిది ఏళ్ళుగా చేపడుతూనేవచ్చింది. జిల్లాలోని 227 మత్స్యసహకార సంఘాలు 155 మహిళా మత్స్య మార్కెటింగ్ సహకార సంఘం, జిల్లా మత్స్య సహకార సంఘాలు ఈ సంఘాలలో 13,894 మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఘాలలో ఉన్న సభ్యులు జిల్లాలోని 778 చెరువుల్లో చేపలు వేటాడి జీవన భృతిని పొందుతున్నారు. గతనాలుగు సంవత్సరాలుగా ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం సజావుగా జరగడం లేదు. మత్స్య శాఖ టెండర్లు పొందిన సదరు కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఈ ఏడాది జిల్లాను ఉచిత చేప పిల్లల పంపిణీ అమలు చేయడంలో ప్రభుత్వం సవతి ప్రేమ అవలంభిస్తుందని మత్స్య కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ పథకం 2016-2017 సంవత్సరంలో సజావుగా కొనసాగింది. 2023నుంచి 2025 వరకు చేప పిల్లల పంపిణీ పథకం ఆలస్యంగా కొనసాగింది. దీంతో టెండర్లు వచ్చేది ఎక్కించుకున్న కాంట్రాక్టర్లు నియమ నిబంధనలు పాటించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంభించారని విమర్శలు తలెత్తాయి. జిల్లాకు ఇక ఉచిత చేప పిల్లలపంపిణీ పథకం లేనట్లేనని మత్స్య కార్మికులు వాపోతున్నారు.


గత ఏడాది నిజాంసాగర్‌లో చేపపిల్లలను విడుదల చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు (ఫైల్)



యూరియా కోసం పాసుపుస్తకాలు లైన్‌లో ఉంచిన రైతులు

యూరియా వచ్చిందోచ్

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ కింద రైతన్నలు మండలంలోని ఆయా గ్రామాల్లో పంటలను సాగు చేశారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలకు యూరియా అవసరం ఉండటంతో రైతన్నలు యూరియా కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. పంటలకు చివరి డోస్ వేయడానికి యూరియా అవసరం ఉండటంతో రైతన్నలు ప్రతీ నిత్యం సహకార సంఘం, ప్రయివేట్ డీలర్ల దగ్గర యూరియా కోసం ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం సహకార సంఘానికి 444 బస్తాల యూరియ రాగా అధికారులు పోలీసుల పర్యవేక్షణలో పాసుపుస్తకానికి ఒక యూరియా బ్యాగ్ అందజేశారు.

నేడు అండర్-14, 17 వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎల్లారెడ్డి,సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నేడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వాలీబాల్ అండర్ 14, 17 ఎంపిక కోసం పోటీలు నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి ఎంఈవో లింగాపురం రాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోఉన్న ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల, కస్తూర్బాఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. ఈ పోటీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని ఆసక్తి గల విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయుడు నిఖిల్ ఫోన్ నెంబర్ 8919912071 సంప్రదించాలని తెలిపారు. అదే విధంగా 1 జనవరి 2012 రోజు లేదా తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.



కొడ్చిర ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖాన)

నేటి నుంచి స్వస్తనారి - స్వశక్తి పరివార్ అభియాన్

మద్నూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం నేటి నుంచి గాంధీ జయంతి వరకు స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి మండలంలోని ఎన్‌బూర, లచ్చన్, కోడ్చిర, మద్నూర్ ఏ, బి.మేనూర్ అయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో మహిళలకు ప్రత్యేకంగా క్యాంపులను ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటి బాధ్యతలు చక్కబెట్టడమే పరమావధిగా పనిచేస్తుంటారు మహిళలు. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి మళ్లీ నిద్రకు ఉపక్రమించేవరకు వారు శ్రమిస్తూనే ఉంటారు. కుటుంబ ఆలన, పాలనపై దృష్టి పెట్టే క్రమంలో తమ ఆరోగ్యంపై శ్రద్ధచూపారు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు తాత్కాలికంగా మందులు వేసుకుని సరిపెట్టుకుంటారు. కానీ ఈ క్రమంలో వారికి సోకుతున్న దీర్ఘకాలిక వ్యాధుల గురించి పట్టించుకోరు. ఫలితంగా అవి ముదిరి వారి ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం 2023 మార్చి 8న ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రారంభించి పరీక్షలు నిర్వహిస్తూ చికిత్సలు అందిస్తుంది. మహిళల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో తాజాగా కేంద్ర ప్రభుత్వం నేటి నుంచి అక్టోబర్ 2 వరకు 15 రోజులపాటు స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుడుతుంది. కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తుంది. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆరోగ్య మందిరాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వైద్య శాఖ ఏర్పాట్లు చేస్తున్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఆగ్రోస్ చైర్మన్


పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న కాసుల

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మహేష్‌కుమార్‌ను ఆయన శాలువా కప్పి సత్కరించారు.

బీర్కూర్ విండో అధ్యక్షుడిగా రాములు బాధ్యతల స్వీకరణ

బీర్కూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ సహకార సంఘం నూతన ఇంచార్జి అధ్యక్షుడిగా ఇంగు రాములు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంగు రాములును నియమిస్తూ డీసీవో రాంమోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఈవో విఠల్ తెలిపారు.

గోడప్రతుల ఆవిష్కరణ

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాత్ర దానం టూర్ ప్యాకేజీకి సంబంధించిన గోడప్రతులను మంగళవారం సబ్‌కలెక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితాదేవి, బసంత్, రాజారాం, జగదీశ్ ఉన్నారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో ఉదయం 8గంటలకు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పిట్లం, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్‌కు చెందిన నాయకులు భాస్కర్ తల్లి, అదే గ్రామానికి చెందిన శివకుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ పరామర్శించారు. చిన్నకొడప్‌గల్ లోని సీనియర్ నాయకులు గుండారెడ్డి మరణించడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు హన్మండ్లు, విండో చైర్మన్ శపథంరెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్, చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

మద్నూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని గురుకుల పాఠశాల కవి వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాలలో విద్యాశాఖ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ, కోకో వాలీబాల్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 300లకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మండ్లు స్వామి, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల దాతగా నిలిచి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శివరాం వైస్ చైర్మన్, భీమ్రావు ప్రిన్సిపాల్ గంగా కిషోర్, పీడీ, పీఈటీలు జాదవ్‌గణేష్, భుజంగ్, కాశీరాం, ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, మౌనిక, మారుతి, మాధురి, రాజేందర్, మండల వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

- వాగుపై వంతెన నిర్మాణానికి నిధుల మంజూరుపై గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకుల హర్షం
- సీఎం, జుక్కల్ ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠల్‌వాడీ సమీపంలో గల వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుపై గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. తాము ప్రభుత్వానికి, సీఎం రేవంత్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్‌లకు రుణపడి ఉంటారని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు పవార్ జాగూర్‌నాయక్ అన్నారు. ఇటీవల భారీవర్షాలకు గ్రామశివారు ప్రాంతంలోని వంతెన కూలిపోగా స్పందించిన ఎమ్మెల్యే ఈజీఎస్ నిధుల నుంచి వంతెన నిర్మాణానికి 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించారు. దీంతో మంగళవారం ఉదయం వంతెన నిర్మించే ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జాగూర్ నాయక్ మాట్లాడుతు తమ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా ఉండగా గతంలో ఎవరూ తమ సమస్యను పరిష్కరించలేదని, ఇటీవల వర్షాలకు వంతెన తెగి రాకపోకలకు అంతరాయం కలుగడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెప్పారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో వంతెన నిర్మాణానికి 50లక్షలు నిధులు మంజూరుచేసి తమకు శాశ్వతంగా పరిష్కారం చూపారన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు దిలీప్, బాల్‌గిరి పటేల్, సురేష్, శంకర్, గంగారెడ్డి, రమేష్ జాగూర్, బన్సీ, బాబు, చందర్ నాయక్, ఏబీఎస్ఎస్ మండల అధ్యక్షులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శిథిలావస్థలో బాన్సువాడ అతిథిగృహం


బాన్సువాడలో నిజాంకాలంలో నిర్మించిన అతిథి గృహం ఇదే

బాన్సువాడటౌన్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): నిజాం నవాబుల కాలంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టుకుంది. ప్రధాన కాల్వల పరిరక్షణకు మహమ్మద్‌నగర్, బాన్సువాడ, జలాల్‌పూర్ గ్రామాలలో అతిథి గృహాల నిర్మాణం చేపట్టారని పెద్దలు చెప్తున్నారు. నాటి కట్టడాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల అతిథి గృహాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో గల పాఠశాలల్లో ఉపాధ్యాయలు విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని బూర్గుపల్లి, సముందర్ తండా గ్రామాల్లో పాఠశాలలను మంగళవారం ఎంఈవో తనిఖీచేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందిస్తున్న బోధనను పరిశీలించారు. దీంతో పాటుగానే తరగతుల వారీగా విద్యార్థుల శక్తి సామర్థ్యాలు పరిశీలించారు. బోధన సరళీకృతంగా ఉంటే విద్యార్థులకు తొందరగా అర్థమవుతుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న బేస్‌లైన్ పరీక్షలను విద్యార్థులు రాసే విధానాన్ని పరిశీలించారు.

పదోన్నతిపై వెళ్తున్న అధికారిణికి సన్మానం

దోమకొండ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దోమకొండలో నాయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి పదోన్నతి పొంది తహసీల్దార్‌గా బదిలీపై నిజామాబాద్‌కు వెళ్తున్న రేఖను మంగళవారం మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారాం మధు, సంతోష్‌రెడ్డి, రాజేందర్, మాల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారిణికి సన్మానిస్తున్న నాయకులు

దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగ పిల్లలకు దేవునిపల్లి ఎస్ఐ రంజిత్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డిలు వీల్‌చైర్స్, బెడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీపుల్‌ఫర్ ఇండియా వారి సహకారంతో గర్గుల్‌లో దివ్యాంగ పిల్లలకు కనీస సౌకర్యాలు తీర్చుకునేందుకు వీల్‌చైర్స్ ఎంతగానో తోడ్పాడుతాయని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు శంకర్, సెక్రటరీ కృష్ణహరి, రమేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

రాజంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో డ్రైడే కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ బాలకృష్ణ తెలిపారు. ఇంటి పరిసరాలలో నీటినిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. మురికికాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. హరితహారం మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీఓ రఘురాం, ఏపీఓ శృతి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కంచె లేక.. ప్రమాదపు అంచుల్లో

- రోడ్ల పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు
- కాలం చెల్లిన స్తంభాలు

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్లక్ష్య వైఖరితో పశువుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికే పదుల సంఖ్యలో పాడి గేదెలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇక ప్రజలు నివాసం ఉండే ప్రాంతాలకు దగ్గరలోనూ రోడ్ల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు సైతం వేలాడుతుండడంతో చిన్న పాటి వర్షం కురుస్తే చాలు కరెంట్ బంద్ అవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. మరోవైపు విద్యుత్ కంబాలు కూడా పురాతమైనవి కావడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిస్తే విరిగిపోయే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

గతంలో ఎన్నో ప్రమాదాలు..

నెల రోజుల క్రితం కామారెడ్డి మండలం అడ్లూర్‌క చెందిన కుంబాల రాజరాం అనే రైతు గేదెలను మేతకు తీసుకేళ్లగా అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందడంతో రైతు కన్నీరు మున్నీరు అయ్యారు. కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో అక్కడ ఉండే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పాటు దేవునిపల్లి శివారులో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుకలో గల విద్యుత్ ట్రాన్స్



రామేశ్వర్‌పల్లి ఇళ్ల ముందే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ఫార్మర్‌కు సైతం కంచె లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా మెయిన్ రోడ్డు పక్కనే ఉండడంతో ఏదైనా వాహనం అదుపు తప్పి రోడ్డు కిందికి దిగిపోతే విద్యుత్ ప్రమాదం జరుగుతుంది. అధికారుల పర్యవక్షేణ సక్రమంగా లేకపోవడంతో కంచె లేని ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పిచ్చి మొక్కలు తీగలు పారి వైర్ల పైకి రావడంతో చిన్నపాటి వర్షానికి విద్యుత్ సమస్యలు తలెత్తుతునాయి. ఇప్పటికైనా విద్యుత్ ట్రాన్స్‌కో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాళభైరవ స్వామి ఆలయంలో పూజలు

రామారెడ్డి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామారెడి- ఇసన్నపల్లి గ్రామాల మధ్య ఉన్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం అంగరంగంగా సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ గర్భగుడిలో ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో సంతతధారాభిశేకం, పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం నుండి భక్తులు ఆలయానికి పాదయాత్ర నిర్వహించారు. భక్తులు మొక్కులు తీరాలని దండా రూపంలో రూ.9,860 సమర్పించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా దేవున్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, ఆలయ మాజీ చైర్మెన్‌లు దోమకొండ శ్రీనివాస్ గుప్తా, అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, వైద్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, మాజీ ధర్మకర్తలు సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి గ్రామపాలన అధికారులు

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామానికి నూతనంగా వచ్చిన జీపీవో సతీష్‌కు మంగళవారం గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అన్ని విధులను సక్రమంగా చేపట్టి ప్రజలకు ఎలప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం ఆయన్ను మాజీ కౌన్సిలర్ ఆకుల రూపరవికుమార్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఎం. సిద్దరాములు, సభ్యులు అంజన్‌కుమార్, శ్రీనివాస్, నాయకులు హన్మండ్లు, సాయిలు, శ్యామ్‌రావు, రాజయ్య, రాజు, లింగం, కుమార్, బాపురాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలానికి 17 మంది గ్రామ పాలన అధికారులను నియమించినట్లు తహసీల్దార్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వీరికి ఆయా గ్రామాలను కేటాయించి గ్రామ ప్రజల సహకారంతో అనువైన స్థలాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పామన్నారు. పెద్ద గ్రామపంచాయతీలు అయిన సదాశివనగర్, అడ్లూర్ ఎల్లారెడ్డిలకు ఇద్దరి చొప్పున, గతంలో ఆమ్లెట్ విలేజ్‌గా ఉన్న గ్రామాలను కలిపి 2 గ్రామాలకు ఒకరిని, తాండాలను ఒక గ్రామపంచాయతీగా చేసి ఒకరిని



సదాశివనగర్‌లో విధుల్లో చేరిన జీపీవోలు

నియమించామని తెలిపారు. విధులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామ నూతన జీపీవోగా సావిత్రి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని, సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతానని అన్నారు. అనంతనం గ్రామస్థులు ఆమెను సన్మానించారు. గ్రామపెద్దలు గురుప్రతాప్, రామాగౌడ్, సంగారెడ్డి, అంజయ్య, గంగారాం, గ్రామ యువకులు పాల్గొన్నారు.

బస్సు కోసం కదిలిన అతివలు

రామారెడ్డి, బాన్సువాడ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం మోషంపూర్ గ్రామానికి జిల్లాకేంద్రం నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు వేయాలని కోరుతూ మంగళవారం ఆ గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు బయలుదేరి వెళ్లారు. డిపో మేనేజర్ కరుణశ్రీ అందుబాటులో లేకపోవడంతో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తికి వినతిపత్రం అందించారు. మోషంపూర్ గ్రామానికి గతంలో బస్సు వచ్చేదని ఇప్పుడు రావడంలేదని, తమ గ్రామానికి ఉదయం రెండు, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సు నడపాలని కోరారు. ప్రైవేట్ వాహనాలు అధిక డబ్బులు వాసులు చేస్తున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. వారి వెంట మాజీ ఎంపీటీసీ భూపల్లి ఉమాదేవి, బీఆర్ఎస్ అధ్యక్షుడు వంగ సంతోష్ రెడ్డి, నవీన్ రెడ్డి, పొన్నాల, రాజమణి, తోకల రాధ, మెరుగు సులోచన, లక్ష్మి, మొరికల బుమవ్వ, మొరికల రేణుక, భారతి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ మండలం సంగోజీపేట్‌లో వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను నిలిపివేశారు. వర్షాలు తగ్గినా బస్సులు రాకపోవడంతో గ్రామస్థులు ఎంతగానో ఇబ్బంది పడ్డారు. ఈ మేరకు గ్రామస్థులు మంగళవారం బాన్సువాడ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు.



బీబీపేటలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చందర్ నాయక్

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలి

దోమకొండ, (బీబీపేట) సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన దోమకొండ, బీబీపేట మండలాల్లో పర్యటించారు. దోమకొండలో మండల సమాఖ్య క్యాంటిన్, గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. బీబీపేటలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటపొలాలు, ఇందిరమ్మ ఇళ్లు, ముదిరాజ్‌వాడలో మురికి కాలువలు, శానిటేషన్ పనులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా మండలాల ఎంపీడీవోలు పూర్ణచంద్రోదయ కుమార్, ప్రవీణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరకుల కిట్ల అందజేత

సదాశివనగర్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కోల్పోయిన వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తహసీల్దార్ సత్యనారాయణ చేతుల మీదుగా మంగళవారం నిత్యవసర కిట్లు అందించారు. కలెక్టర్ అనుమతితో మండలంలో 15 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజన్న, సొసైటీ మండల అధ్యక్షుడు కమలాకర్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి, మాజీ వైస్ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల రాజేందర్, గిర్దావర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.7777 విరాళం

మాచారెడ్డి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలం చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అభివృద్ధికి కామారెడ్డికి చెందిన ఎర్రోళ్ల శృతి ప్రదీప్ దంపతులు మంగళవారం రూ.7777లను విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, విరాళాలు అందజేస్తున్న దాతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

లింగంపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లికి చెందిన రైతు పెద్ద బాలయ్య గేదెకు ఒకే ఈతలో రెండు దూడలు పుట్టినట్లు గోపాల మిత్ర కార్యకర్త రమేష్ తెలిపారు. ఒకటి మగ దూడ, మరోకటి ఆడదూడలు జన్మించాయని రెండు క్షేమంగా ఉన్నాయన్నారు.

మల్లారం చెరువు నింపేందుకు కాలువలు

లింగంపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి- మల్లారం చెరువుకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండిపడి నీరు లేకుండా చెరువు పూర్తిగా ఖాళీ అయింది. దీంతో చెరువు కింద ఉన్న పంటలను కాపాడేందుకు తాత్కాలికంగా నీటిని నింపేందుకు కాలువలను ఏర్పాటు చేస్తున్నట్లు నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులకు నష్టం కలుగకుండా కాపాడుతామని చెప్పారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

సహకారశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల ఎన్నిక

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకారశాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఎన్నికలను మంగళవారం టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా జి.నర్సింలు, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ అలీం, సాయినాథ్, కార్యదర్శి మసియోద్దిన్, జాయింట్ సెక్రటరీ రాధిక, విశ్వనాథ్, కోశాధికారి సృజన్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్, పబ్లిసిటీ సెక్రటరీ విష్ణు, ఈసీ మెంబర్‌లు మమత, విజయలక్ష్మీ, రమాదేవిలతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర టీఎన్‌జీవోస్ మహిళ సెక్రటరీ రాజకుమారి, జిల్లా సభ్యులు చక్రధర్,దేవరాజు,రామగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రేకులషెడ్ తొలగిస్తున్న అధికారులు

జీపీ స్థలంలో రేకులషెడ్డు తొలగింపు

భిక్కనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న వెంచర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామపంచాయతీ స్థలంలో వేసిన రేకుల షెడ్డును అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆలయ సమీపంలోని వెంచర్‌లో గ్రామపంచాయతీకి కేటాయించిన 10శాతం స్థలంలో వెంచర్ నిర్వహకుడు అనుమతి లేకుండా షెడ్డు వేశాడని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు తొలగించామన్నారు. పంచాయతీ స్థలాన్ని కబ్జా చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఈవో మహేష్‌కుమార్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కొత్తలోక
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి బ్రహ్మాండ
వెంకటేశ్వర కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

ప్రజాపాలనకు పట్టాభిషేకం

(5వ పేజీ తరువాయి)

చేశారు. అదే పాఠశాలలో చదువుతున్న రంగాచారి చిత్రలేఖనంలో మంచి ప్రావీణ్యం సాధించారు. ఆ పాఠశాలలో ఉన్న చిత్రలేఖనం ఉపాధ్యాయుడు బషీరొద్దీన్ రంగాచారితో పాటు అతని మిత్రుడు విఠల్‌రావును మరింత ప్రావీణ్యం సాధించడానికి హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో చేర్పించారు. 1943వ సంవత్సరంలో రంగాచారి తండ్రి లక్ష్మణాచారి అనారోగ్యంతో మృతి చెందడంతో రంగాచారికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అతని మిత్రుడు విఠల్‌రావు సహాయంతో ట్యూషన్స్ చెబుతూ మెరిట్ స్కాలర్ షిప్‌తో అతని చదువును కొనసాగించారు. రంగాచారి కళాశాలల్లో చదివే రోజుల్లోనే రజాకార్ల కార్యకలాపాలు ఉధృతంగా ఉండేవి. రజాకార్ల కార్యకలాపాలకు దీటుగా ఆర్యసమాజ్ తీవ్రంగా పోరాడుతుండేది. దీంతో రంగాచారి విఠల్‌రావులు ఆర్య సమాజం పట్ల ఆకర్షితులై అందులో చేరారు. కానీ ఆర్య సమాజ్ కేవలం హిందువులకు మాత్రమే ప్రాతినిథ్యం వహించడంతో రంగాచారి, విఠల్‌రావులు అందులో నుంచి బయటకు వచ్చి హైదరాబాద్ స్టూడెంట్ యూనియన్‌లో చేరి విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అదే సమయంలో కామ్రెడ్ అసోసియేషన్ నాయకుడైన డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్, మఖ్దూం మోహియొద్దీన్, రావి నారాయణరెడ్డిలతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని హైదరాబాద్ సంస్థానంలో ప్రజలు జరుపుతున్న ఉద్యమాలపై సామాజిక సమస్యలపై చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేసేవారు. భూస్వాముల దోపిడీపై నిర్బంధ పన్నుల వసూళ్లపై రంగాచారి ఎన్నో తైలవర్ణ చిత్రాలు వేసేవారు. 1946లో భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ సంస్థానంలో నిషేధానికి గురి కావడం, ఆ పార్టీ కార్యదర్శి రాజ్‌బహదూర్ గౌడ్ అరెస్టు కావడం జరిగింది. దీంతో రంగాచారితో పాటు మరికొందరు నాయకులు పార్టీ దళితుల కోసం వివిధ వర్గాల నుంచి ఆయుధాలను సేకరించి తెలంగాణ పోరాట ప్రాంతం నుంచి రహస్యంగా ఆయుధాలను చేరవేసేవారు. ఆయుధాలను చేరవేస్తుండగా జరిగిన అపాయంలో గాయపడ్డ డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్‌ను పోలీసు కస్టడీలో ఉన్నప్పటికీ ఉస్మానియా ఆస్పత్రి నుంచి ఆయన్ను తప్పించడంలో రంగాచారి కీలక పాత్ర వహించారు. అంతే కాకుండా నాటి విద్యార్థి నాయకుడు చెన్నమనేని రాజేశ్వర్‌రావును సైతం మతోన్మాద గుండాల నుంచి రక్షించినట్లు చరిత్ర చెబుతుంది. రహస్య స్థావరాల్లో ఉన్న కార్యకర్తలను అనేక విధాలుగా రక్షణ కల్పిస్తూ ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలను రంగాచారి ఇచ్చేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి చెందిన పి. రాంచంద్రారెడ్డిని ఆనాడు ఎలుగుబంటి దాడి చేయడంతో అతన్ని చికిత్స నిమిత్తం రంగాచారి రహస్య స్థావరానికి తీసుకెళ్లారు. రక్తం మరకలతో స్థావరాన్ని కనుగొన్న పోలీసులు 1949 జూలై 23న రంగాచారితో పాటు అక్కడే ఉన్న వెదిరే రాజిరెడ్డిలను అరెస్టు చేసి చంచల్‌గూడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. చిత్ర హింసలు పెట్టినా కమ్యూనిస్టు ఉద్యమాలకు సంబంధించిన విషయాలను రంగాచారి పోలీసులకు ఏమి చెప్పకపోవడంతో వారిని వరంగల్‌లోని మామునూర్ కాన్సెట్రేషన్ (ముళ్లకంచె కలిగిన బహిరంగ నిర్బంధ ప్రదేశం) క్యాంపునకు తరలించారు. అయినప్పటికీ రంగాచారి రహస్యాలు ఏమి చెప్పకపోవడంతో 1949 అక్టోబరు 29న రంగాచారితో పాటు వెదిరే రాజిరెడ్డిలను పోలీసులు అత్యంత క్రూరంగా కాల్చి చంపారు. కామారెడ్డి పట్టణంలోని పెద్దబజార్ ప్రాంతంలో రంగాచారితో పాటు అతని మిత్రుడు విఠల్‌రావు నివాసం ఉండేవారు.

కుప్రియాల్ గోపాల్‌రెడ్డిది గొప్ప చరిత్ర

సాయుధ పోరాటంలో కామారెడ్డి జిల్లాలో రజకార్ల ఆగడాలను ఎదిరించిన యోధుల్లో సదాశివనగర్ మండలం కుప్రియాల్ గోపాల్‌రెడ్డి ఒకరు. మల్లన్నగుట్టపై రజాకార్లను ఎదిరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు తలమడ్లలో, మద్దికుంటలో గల రైస్‌డిపోలపై దాడి చేసి బియ్యాన్ని కొల్లగొట్టి గ్రామాల్లో పంచారు. అంతే కాకుండా భూమి లేని నిరుపేదలకు భూమిని పంచి రజకార్ల గుండెల్లో గుబులు పుట్టించారు. మారువేశంలో గ్రామాల్లో రాత్రి వేళ్లలో సమావేశాలు నిర్వహించి రజకార్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చారు. అలాగే తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌కు చెందిన బొక్క గుండారెడ్డి, బొక్క గంగారెడ్డి, బద్దం రాజిరెడ్డి, చాకలి ఎల్లయ్య, గొల్ల లచ్చయ్య, దండు రాజన్న, లింగంగౌడ్‌తో పాటు మరో ఎంతో మంది కామారెడ్డి డివిజన్‌లోని గ్రామాల్లో కూడా రజాకార్లను వ్యతిరేకించిన వారి చరిత్రలు ఉన్నాయి.



సాయుధ పోరాటంలో పాల్గొన్న పిట్లం యోధులు

ప్రజా ఉద్యమానికి నాంది పలికిన వకిల్ భూమారెడ్డి

బ్రిటీష్ ఇండియా హయాంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో జాతీయ కాంగ్రెస్ పాత్ర ఎంత ఉందో హైదరాబాద్ సంస్థాన విముక్తి పోరాటంలో తెలంగాణ ప్రజల పాత్ర కూడా అంతే ఉంది. ఇక్కడి ప్రజలను చైతన్య పరచడంలో అప్పటి ఆంధ్ర మహాసభలు ఎంతగానో దోహదం చేశాయి. ఇలాంటి ప్రజాఉద్యమం కొనసాగిన నేపథ్యంలో తెలంగాణ ప్రజలలో ఆంధ్ర మహాసభలు ఎంతో



పిట్లంలో సమరయోధులు నెలకొల్పిన గాంధీ విగ్రహం

చైతన్యం కలిగించాయనేది చారిత్రక వాస్తవం. నిజాం నవాబు పాలనలో హైదరాబాద్ రాష్ట్రంగా కొనసాగిన తరుణంలో కామారెడ్డి జిల్లాలోని దోమకొండసంస్థాన పరిధిలోని అంబారీపేట గ్రామానికి చెందిన బెంజారం రామ్‌రెడ్డి రెండో కుమారుడైన భూమారెడ్డి అలియాస్ వకీల్ భూమారెడ్డి అప్పటి ఆంధ్రమహాసభ సభ్యుడిగా కొనసాగారు. న్యాయవాదిగా కొనసాగుతునే వర్తక స్వాతంత్ర్యం, వెట్టిచాకిరి నిషేధం అనే పుస్తకాల ద్వారా కామారెడ్డి ప్రాంతంలోని గ్రామాల్లో పర్యటించి, గ్రామీణ ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ క్రమంలో ఫారెస్ట్, రెవెన్యూ అధికారి, పోలీసు అధికారుల అక్రమ వసూళ్లబారి నుంచి భూస్వాముల వెట్టిచాకిరి నుంచి ప్రజలను వర్తకులను కాపాడారు.

సాయుధ పోరాటంలో పిట్లం వాసులదే కీలక పాత్ర

పెద్ద కొడప్‌గల్: నిజాం రజాకార్ల పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం పోరాటం జరిగిన సమయంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మంది పోరాటం చేస్తే అందులో బాన్సువాడ డివిజన్ నుంచి కొందరు నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. బాన్సువాడ డివిజన్ నుంచి 8 మంది పోరాటం చేస్తే అందులో నుంచి పిట్లం మండల కేంద్రానికి చెందిన 6 గురు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన ఉప్పు లక్ష్మయ్య, గంగ నాగయ్య, కమ్మరి లక్ష్మారెడ్డి, నీలకంఠి నారాయణ, లోక లక్ష్మయ్య, కొండ నారాయణలు పోరాటంలో పాలు పంచుకున్నారు. సాయుధ పోరాటంలో పాల్గొని తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేసిన ఘనత పిట్లం వాసులకు దక్కింది. దీంతో వీరి పోరాటానికి గుర్తుగా 1977 సంవత్సరంలో పిట్లం మండల కేంద్రంలో గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమరయోధుల వారసుల కుటుంబాల వారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న వారి పేర్లను బాన్సువాడ తహసీల్దార్ కార్యాలయం ముందు శిలాఫలకం వేయించారు. తెలంగాణ విముక్తికోసం పోరాటం చేసిన పిట్లం వాసులు జైలుశిక్షను అనుభవించారని, సమర యోధుల పోరాటానికి గుర్తింపుగా అప్పటి ప్రభుత్వం తామ్ర పతకాలను అందజేసింది. 1969 సంవత్సరంలో నిజామాబాద్‌కు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వచ్చిన సందర్భంలో పిట్లం మండల కేంద్రానికి చెందిన సాయుధ పోరాట యోధులను గుర్తు చేశారు. సాయుధ పోరాటంలో పిట్లంకు పేరు తీసుకవచ్చిన యోధుల్ని ఎప్పటికి ఈ ప్రాంత ప్రజలు మరుమలేమంటున్నారు.

ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన కార్మికులు

లింగంపేట, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఆర్టీసీ తాత్కాలిక కార్మికులు మంగళవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహిమూద్‌ను హైదరాబాద్‌లో కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రెండవ సారి ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా వారు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ కార్మికుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. రాష్ట్ర పీసీసీ మైనారిటీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు ఫతియోద్దీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణు, గోపాల్, సిదు పాల్గొన్నారు.



మహమూద్‌ను కలిసిన ఆర్టీసీ తాత్కాలిక కార్మికులు

ఎమ్మెల్యే స్పందించారు.. సమస్య తీర్చారు

రాజంపేట, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో నిర్మించిన ఆర్అండ్‌బీ బ్రిడ్జి వరుసగా కురుస్తున్న వర్షాలకు కుంగింది. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన మంగళవారం కంకర, మొరం, మట్టిపోయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.



అధికార పార్టీకి అధ్యక్ష పీఠం దక్కేనా..?

- తాడ్వాయి, దేమీకలాన్ సొసైటీలకు ముగిసిన పదవీకాలం
- ప్రత్యేక అధికారుల పాలనతో నడిపిస్తారా?

తాడ్వాయి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు దేమీకలాన్ సింగిల్ విండో అధ్యక్ష పదవుల పాలకవర్గ పదవీకాలం ముగియడంతో కొత్త అధ్యక్షులను అధికార కాంగ్రెస్ దక్కించుకుంటుందో లేక ప్రత్యేక పాలన అధికారులచే కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి. మండల కేంద్రంలోని సింగిల్ విండో అప్పటి బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్ నల్లవెల్లి కపిల్ రెడ్డి కైవసం చేసుకోగా, దేమీకలాన్ సింగిల్ విండో బీజేపీకి చెందిన డైరెక్టర్ కాటిపల్లి రాజశేఖర్ రెడ్డి కైవసం చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గెలిచిన సొసైటీలోనీ పదవీకాలం పూర్తవడంతో ఈ రెండు సొసైటీలలో అధికార పార్టీ అధ్యక్షులను పెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. అధికార పార్టీ కండువా కప్పుకుంటే తిరిగి వారినే అధ్యక్షులుగా నియమిస్తామని అంటున్నారని పలువురు చర్చిస్తున్నారు. తాడ్వాయి సొసైటీకి చెందిన కొందరు డైరెక్టరు అధ్యక్ష పదవి కోసం అధికార పార్టీలో చేరినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ రెండు సొసైటీలపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అధికార పార్టీకి చెందిన అధ్యక్షులను నియమించుకొని కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని



తాడ్వాయి సింగిల్ విండో కార్యాలయం

చూస్తున్నారు. ఇక్కడ ఒకవేళ అధికార పార్టీ పట్టు సాధించకపోతే ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తారని మండలంలో పలువురు చర్చించుకుంటున్నారు. సహకార సంఘాల అధ్యక్షులు పార్టీ గుర్తుల మీద గెలవలేదని, ఈ సంఘాలు రైతులకు సంబంధించినవని రైతుకు ఏ పార్టీ అయినా ఒకటేనని పలువురు అంటున్నారు.